## నెల్లూరుముచ్చట్లు

6వ పేజీ కొరవ

గుండె డాక్టర్ అంజనీకుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జె.వి.ఎస్.కృష్ణమూర్తి, మాజీ అధ్యక్షుడు వి. ఉదయభాస్కర రావు, రామ్మోహన్, రమణయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శిబి రంలో 150 మందికి ఉచిత పరీక్షలు జరిపి మందులు పంచిపెట్టారు.

***

మధుమేహ వ్యాధి దినోత్సవం సందర్భంగా షుగర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ రచించిన 'మధుమేహం' పుస్తకాన్ని నెల్లూరు డాక్టర్ల కులపెద్ద జెట్టి శేషారెడ్డి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్లు ఎ.పెంచలయ్య, విద్యాసాగర్‌లు పాల్గొన్నారు. గతంలో డయాబెటిస్ క్లబ్ నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఈ సందర్భంగా బహుమతి ప్రదానం చేశారు.

### న్యాయమూర్తి మరణం

అల్లీపురం వాసి, రిటైర్డ్ జిల్లా జడ్జి పెగళ్రాజు బుచ్చిరాజు (79), నవంబర్ 6తేది హైదరాబాద్‌లో మరణిం చారు. 1947లో న్యాయవాదిగా నెల్లూరులో ప్రాక్టీసు ప్రారంభించిన బుచ్చిరాజు, న్యాయమూర్తిగా రాష్ట్రంలో పలు చోట్ల పనిచేశారు. అనంతపురం జిల్లా జడ్జిగా పనిచేస్తూ 1977లో రిటైర్డ్ అయ్యారు. బుచ్చిరాజుకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. వారి కుటుంబానికి మా సానుభూతి.

## ఎమ్మెల్యేల

మొదటి పేజీ కొరవ

కావలి వేణుగోపాలరెడ్డి, ఉదయగిరి విజయరామిరెడ్డి లిరువురు తాము కొత్తవాళ్లం కాబట్టి తమకు అవకాశం ఇవ్వాలని బ్రతిమలాడుతున్నారు. నల్లపరెడ్డి ప్రసన్న తన సీనియారిటీ ప్రస్తావిస్తున్నాడు. బల్లి దుర్గాప్రసాద్ - తనకు చంద్రబాబుతో గల స్నేహం నెమరు వేస్తున్నాడు; పరసా రత్నం గారు తనకు ఖాయం అనే ధైర్యంలో వున్నాడు. ఎవరి ప్రయత్నాలు వారివిగా వున్నాయి. ఒక్క పరసా రత్నం తప్ప తతిమా వారంతా మాకు ఇవ్వండి. లేకుంటే ప్రభాకరరెడ్డిని కొనసాగించండి; అంతే తప్ప చంద్రమోహన్‌రెడ్డిని మాత్రం మా నెత్తిన తెచ్చి కూర్చోబెట్ట వద్దని విజ్ఞప్తి చేస్తున్నారట ముఖ్యమంత్రికి. పరసా రత్నం మాత్రం తన సంగతి మాత్రమే మాట్లాడి బయటకు వచ్చేశాడని చెప్తున్నారు. ఇందరు ఎమ్మెల్యేల మాట కాదని ప్రభాకరరెడ్డి విషయంలో నిర్ణయం తీసుకునే అవకాశం వుంటుందా అన్నదే ప్రశ్న. అందులోను ఎమ్మెల్యేలకు మనస్తాపం కల్గించకుండా మంత్రివర్గ విస్తరణ జరపాలని ప్రయత్నించే ఈ సమయంలో?

నల్లపరెడ్డి శీనయ్య నుంచి రాజకీయ పాఠాలు నేర్చుకుని కూడా జిల్లా రాజకీయాలలో తానెందుకు ఒంటరి పక్షినైపోయానో చంద్రమోహన్‌రెడ్డి ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకుంటే కనీసం భవిష్యత్తు అయినా బాగుంటుంది.

## ఈనాడు

మొదటి పేజీ కొరవ

ఆ ఒత్తిడికి తల వొగ్గిన చంద్రబాబు ఆ టెండర్లన్నిటిని గుట్టు చప్పుడు కాకుండా ఆమోదింపచేశాడు. మంత్రి ప్రకటన కేవలం ప్రజలను తప్పుదారి పట్టించడానికి మాత్రమే ఉపయోగ పడింది. మండవ వెంకటేశ్వరరావు నిప్పు వంటి నిజాయితీపరుడు; ఏ పాపం ఎరుగని వాడు. అందువల్ల టెండర్ల రద్దుకు సిద్ధపడ్డాడు. కాని ముఖ్యమంత్రి పరిస్థితి అది కాదు కదా? ఇందులో అవినీతి వుందని వాదిస్తే -నువ్వు తిన్న పనులలో అవినీతి లేదా అని ఎదురు ప్రశ్నించే పరిస్థితి ఏర్పడి వుంది ఎమ్మెల్యేలలో. వారి బెదరింపులకు తల దించడం తప్ప ఆయన చేయగల్గింది ఏదీ లేదు.

ముఖ్యమంత్రి ఒక దాని వెంట ఒకటిగా ఇట్లా తప్పులు చేస్తూ దొరికి పోవడం ఒక దోషమైతే - అవి ఈనాడు పత్రికలో ప్రాధాన్యత కల్గిన వార్తలుగా చోటు చేసుకోవడం మరీ పెద్ద దోషం. వీరద్దరి మధ్య సంబంధాలలో ఏదైనా తేడా వచ్చిందా అన్న సందేహానికి దారి తీస్తున్నాయి ఈ వార్తలు. అదే నిజమైతే మాత్రం చంద్రబాబుకు ముందున్నదంతా ముసళ్ల పండగలే - పాపం. ఈనాడు కన్నెర్ర చేస్తే తట్టుకోగల్గే స్తోమత ఆయనకే కాదు, ఇప్పటిలో ఏ రాజకీయ వాడికీ లేదు మన రాష్ట్రంలో.



ఇందిరాగాంధీ జన్మదినోత్సవం సందర్భంగా ఆమె విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకదళం, కార్యకర్తలు.






### జమీన్‌రైతు

### చందా పెంపు - సహకరించండి!

రెండు రూపాయల సబ్సిడీ బియ్యం పథకం సైతం మార్పులకు గురైంది - కాని గత పన్నెండేళ్ళ నుంచి జమీన్‌రైతు వారపత్రిక ధర మాత్రం రెండు రూపాయల్లోనే నిల్చిపోయింది. ఇంతకాలం ఈ భారం ఎంతో ప్రయాసకు ఓర్చి మోశాం; ఇక మా శక్యం కావడం లేదు. రేపు డిసెంబరు 1 తేది నుంచి చందా రేటు ఈ క్రింది విధంగా సవరిస్తున్నాము.

విడి పత్రిక ...రూ. 3/-లు
సంవత్సర చందా ...రూ.150/-లు

పాఠకులు సహృదయంతో అర్థం చేసుకొని, సహకరిస్తారని ఆశిస్తున్నాము.

... మేనేజరు

## ఒప్పుకోదు

2వ పేజీ తరువాత

వంటి రిజిష్టర్ సంస్థలన్నీ ఈ చట్టం క్రిందకు వస్తాయి. ఆయా కమిటీలకు ఇష్టం వున్నా లేకున్నా అది తప్పదు. ఈ చట్టం ప్రకారం ఏ సొసైటీ అయినా తన ఆస్తులు పరాధీనం చేయాలంటే ముందుగా ఎండోమెంట్ కమీషనర్ అనుమతి తీసుకోవాలి. కమీషనర్ అటువంటి అనుమతులు ఇవ్వాలంటే ప్రజల అభిప్రాయాలు కోరుతూ పత్రికలలో ప్రకటనలు, గజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనిదే ఎటువంటి నిర్ణయం తీసుకోకూడదు.

నెల్లూరులోని సర్వోదయ కాలేజీని ఎండోమెంట్ శాఖ తన స్వాధీనం చేసుకోవడం ఈ చట్టం ప్రకారమే జరిగింది. కస్తూరిదేవి విద్యాలయానికి కూడా అదే సూత్రం వర్తిస్తుంది. అయితే సర్వోదయ యాజమాన్యం రాజకీయంగా బలహీనమైనది. జి.వి.కె. వంటి పారిశ్రామిక వేత్త ప్రమేయం వున్న కస్తూరిదేవిలో జోక్యం చేసుకునే ధైర్యం ఎండోమెంట్ శాఖకు కాని, రాజకీయ వాదికి కాని, ఎన్నికైన ప్రజాప్రతినిధులకు కాని వుంటుందని నేను భావించడం లేదు. కాని ఇటువంటి విషయాలలో రాజకీయ వాదులు రాజీ పడుతారే తప్ప సామాజిక స్పృహ కల్గినవారు, విద్యార్థులు, నిస్వార్థంగా టౌన్ శ్రేయస్సును కాంక్షించే వారు వూరకుండలేరు. కస్తూరిదేవి విద్యాలయాన్ని రక్షించే కృషిలో పట్టణ ప్రజానీకం, మేధావులు సమైక్యం కావాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

## పొగిడారు

2వ పేజీ తరువాత

భూమిని 13వేల రూపాయల వెలకు తన ట్రస్టు పరం చేసుకున్న పత్రాలు చదివినప్పుడైనా తాను తప్పు చేస్తున్నానన్న సంగతి ఆయనకు తెలియకుండా వుంటుందా?

తన ఆశయాలకు భిన్నంగా తాను స్థాపించిన విద్యాలయం వ్యాపార పరం కావడం చూసి పొణకా కనకమ్మ ఆత్మ క్షోభిస్తున్నదని వ్రాశారు; కాని ఇంత పెద్ద సంఘటనలో జి.వి.కె. తప్పు లేనే లేదని మీరు చేసిన వ్యాఖ్య చూసి మీ పత్రిక స్థాపకుడు వెంకట్రామానాయుడు ఆత్మ క్షోభించకుండా వుంటుందా? ఎందుకీ ముసుగులో గ్రుద్దులాట?

జి.వి.కె. గారు కాని, జె.వి.రెడ్డి గారు కాని నిజమైన సేవా దృక్పథంలో ఈ ప్రణాళిక రచించి వుంటే అందుకు వారు చేయవల్సిన పని ఫైవ్ స్టార్ స్కూల్ నిర్మాణం కాదు. నాటి దాతల ఆశయాలకు అనుగుణంగా పేద మధ్యతరగతి బాలికలకు ప్రయోజనం కల్గించే రీతిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందజేసే విద్యాసంస్థలు నెలకొల్పడం సముచితం. కస్తూరిదేవి విద్యాలయం వంటి సంస్థలలో ఏ మార్పు తలపెట్టినా వాటి స్థాపకుల లక్ష్యాలు, ఆశయాలు దెబ్బ తినకుండా చూడడం చాలా అవసరం.



ఇళ్ళమంత్రి ఆదాల ప్రభాకర రెడ్డికి నెల్లూరు వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ మర్యాదలతో స్వాగతం చెబుతున్న అర్చకులు. ఫోటోలో ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, ఖాజావలి, వివేకానందరెడ్డి కూడ వున్నారు.

## భయపడితే

మొదటి పేజీ తరువాత

ఇప్పుడే తేల్చుకోవాలని అందరి ప్రయత్నం.

అరడజను మంది పాత మంత్రులకు ఉద్వాసన పలికి, దాదాపు అంత మందిని కొత్తగా తీసుకుంటారని పరిశీలకుల వూహ. కొత్తగా తీసుకోవడం తప్ప కొత్త వారిని తీసుకోవడం జరగదని కూడా ఒక అభిప్రాయం. గత మంత్రి వర్గంలో చాలా మంది కొత్త శాసనసభ్యలకు అవకాశం ఇచ్చాడు ముఖ్యమంత్రి. విజయరామరావు, పుష్పలీల, పద్మావతి, అరుణ, శివప్రసాద్ తదితరులంతా రాజకీయాలకు కొత్త వారు. అయితే వీరితో పెద్దగా ఫలితం కన్పడలేదు. సగం మంది అవినీతిలో పాతవారిని తలదన్నే రీతిలో ప్రవర్తిస్తే, మరికొంత మంది మంత్రి పదవి నిర్వచనం తెలుసుకోలేక చతికిలబడి పోయారు. వారి వల్ల ఇటు పార్టీకి, అటు ప్రభుత్వానికి కూడా వుపయోగం కన్పించలేదు.

ఇంకొక ప్రక్క కోడేల శివప్రసాద్, చంద్రమోహన్‌రెడ్డి, పరసారత్నం, గోపాలకృష్ణారెడ్డి వంటి పాత మంత్రులను ఇంటిపట్టున కూర్చొబెట్టినందువల్ల కల్గిన ఫలితం కూడా ఏదీ లేదు. కొంత మేరకు నష్టం జరిగిన మాట వాస్తవం. చిత్తూరు జిల్లాలో మొన్నటి జిప ఎన్నికలలో తెలుగుదేశం ఓటమికి బొజ్జా గోపాల కృష్ణారెడ్డి సహాయ నిరాకరణ ఒక కారణమని చంద్రబాబు అభిప్రాయం. తతిమా జిల్లాలలోను అదే పరిస్థితి. వీరిని మంత్రులుగా వుంచితే తమ స్థాయికి మించి పోయి, చీకాకులు సృష్టిస్తారనే ఉద్దేశంతో ప్రక్కన పెట్టారు. అయితే ఎంతో కాలం వీరిని వూరకే కూర్చొబెడితే పార్టీకి ప్రమాదం అన్న జంకు ఇప్పుడు ఏర్పడుతున్నది.

అయితే ఇప్పుడు ఇటువంటి వారందరిని క్యాబినెట్‌లో చేర్చుకుంటే ముఖ్యమంత్రి పార్టీలో పలుకుబడి కల్గిన వారిని వదలుకోలేని బలహీన స్థితికి వచ్చేశాడన్న ప్రచారం జరిగే ప్రమాదం వుంది. మంత్రివర్గ విస్తరణ రెండు నెలలు వ్యవధి పడితేనే వూహించని దుష్పరిణామాలు జరిగాయి. ఇక భయపడి తమకు మంత్రి పదవులు ఇచ్చాడన్న అభిప్రాయంతో వీరు క్యాబినెట్‌లో చేరితే - ముందు ముందు ఇటు పార్టీ, అటు ప్రభుత్వం కూడా తన అదుపు తప్పి పోవచ్చునన్న శంక కూడా చంద్రబాబును పీడిస్తున్నది. ఈ శంక నిజమైతే మాత్రం రేపటి మంత్రి వర్గ విస్తరణలో వూహించినంత పోషం ఏదీ వుండక పోవచ్చు. ప్రచారంలో వున్న పెద్ద పెద్ద పేర్లను కావాలని తొక్కి పెట్టవచ్చు. జరుగుతున్న ప్రచారం నిజమై, చంద్రబాబులో నిజంగానే భయం పెరిగిపోయి వుంటే మాత్రం కోడెల, గోపాలకృష్ణారెడ్డి వంటి వారికి జెండా వున్న కారెక్కె భాగ్యం లభిస్తుంది.

5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుభవార్త
నవోదయ సీటు పొందండి 1,00,000 రూపాయలు ఆదా చేయండి.
నవోదయ & కోరుకొండ
3, 4వ బ్యాచ్‌లకు అడ్మిషన్లు జరుగుచున్నవి.
శ్రీ నేతాజీ (MSR)
పైలట్ హైస్కూల్ & కోచింగ్ సెంటర్
విజయమహల్ ఎదురుగా, నెల్లూరు- 2
ఫోన్స్: 329470, 328824
* గమనిక : నవోదయకు అప్లికేషన్ పంపవలసిన ఆఖరు తేది డిసెంబరు 3 వరకు పొడిగించడమైనది.

విమల్ జంక్షన్ వారి పండుగ సంబరాలు
సూటింగ్స్, షర్టింగ్స్, జెంట్స్ రెడిమేడ్స్
రు. 200/- కొనుగోలుపై గిఫ్ట్ కూపన్ పొందండి.
హీరోహోండా, కలర్ టి.వి., ఫ్రిజ్ ను గెలుపొందండి.


తే 20-10-2001 ది నుండి 15-1-2002 వరకు
ఫోన్: 325420
విమల్ జంక్షన్ కాపువీధి నెల్లూరు

ఒకే కంపెనీ కాదు, ఎన్నో రకాల కంపెనీల సెల్‌ఫోన్స్ లేటెస్ట్ మోడల్స్‌లో దొరుకును.
అన్ని రకాల వాచ్‌లు, సెల్‌ఫోన్స్, అలారం టైంపీసులు దొరుకును.

సేల్స్ & సర్వీసు
ESTD : 2000
మదీనా వాచ్ హౌస్
PMR ట్రేడ్ కాంప్లెక్స్, ఆర్.టి.సి. బస్టాండు దగ్గర, నెల్లూరు. ఫోన్: 329954

THE UNDISPUTED LEADER
KING AMONG CEMENTS
Priya Cement
43 / 53 / Coastal King / Super Grade Cement